నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, శనివారం 12 అక్టోబర్ 2024 | KAMAREDDY

- నేడు విజయదశమి
- ప్రత్యేక పూజలకు ముస్తాబైన ఆలయాలు
- ఉమ్మడి జిల్లాలో సందడిగా మారిన మార్కెట్

విజయానికి ప్రతీక దసరా

ఆశ్వయుజ శుద్ధ దశమిని విజయానికి సంకేతంగా అమ్మవారిని ఆరాధించుకొనే విజయదశమి పర్వదినాన్ని శనివారం ఉమ్మడి జిల్లా ప్రజలు అట్టహాసంగా జరుపుకోనున్నారు. తొమ్మిది రోజులపాటు వైభవంగా సాగిన దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు దసరా నాడే పూర్ణాహుతి, ఉత్తర పూజతో సంపూర్ణం కానున్నాయి. దసరాను పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. విజయదశమి సందర్భంగా కొనుగోలుదారులతో మార్కెట్లు సందడిగా మారాయి.

-సుభాష్‌నగర్, అక్టోబర్ 11

ఎంఐఎం కౌన్సిలర్ జాకీర్‌పై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

'గన్ ఉంది.. జాగ్రత్త'

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి మాస్ వార్నింగ్
- పోలీసుల సమక్షంలోనే హెచ్చరిక
- ఇక్కడ మీ ఆటలు కొనసాగవు
- ఆర్మూర్‌ను ఓల్డ్‌సిటీ కానివ్వను
- ఎంఐఎం కౌన్సిలర్‌పై రాకేశ్‌రెడ్డి ఆగ్రహం

ఆర్మూర్ టౌన్, అక్టోబర్11: ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి మాస్ వార్నింగ్ ఇచ్చారు. తన దగ్గర గన్ ఉందని, జాగ్రత్త అని హెచ్చరించారు. శుక్రవారం ఆర్మూర్‌లో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే హల్‌చల్ చేశారు. అటు అధికారులు, ఇటు ఎంఐఎం నేతలపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి కాంగ్రెస్ నేతలను అనుమతించిన పోలీసులు బీజేపీ నాయకులను లోపలికి రానివ్వలేదు. విషయం తెలుసుకున్న రాకేశ్ రెడ్డి బయటికి వచ్చి పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే తమ వారిని లోపలికి పంపించండి లేకపోతే కాంగ్రెస్ వారిని బయటికి పంపించాలని పోలీసులకు సూచించారు. ఈ నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో 'నా దగ్గర్ గన్ ఉంది జాగ్రత్త. వాళ్ల (కాంగ్రెస్ నేతల)తో చెప్పండి' అని ఎమ్మెల్యే పోలీసులకు సూచించారు.

మరోవైపు, ప్రొటోకాల్ విషయంలోనూ కొద్దిసేపు గొడవ జరిగింది. ఫ్లెక్సీలో ఎంపీ అర్వింద్‌తో పాటు స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య ఫొటోలు లేకపోవడంపై నేతలు అసహనం వ్యక్తం చేశారు. చివరకు కొత్త ఫ్లెక్సీ పెట్టడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు కలిసి చెక్కులు పంపిణీ చేశారు. అయితే, ఎంఐఎం కౌన్సిలర్ జాకీర్ వేదికపైకి వచ్చి.. షాదీ ముబారక్ చెక్కులు ఆలస్యంగా వస్తున్నాయని, అవి బౌన్స్ అవుతున్నాయని ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగారు. చెక్కులు బౌన్స్ అయితే నా దగ్గరకు వస్తే సమస్యను పరిష్కరిస్తా. కానీ అధికారుల చుట్టూ తిరిగితే ఏం లాభం జరుగుతుందని ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి కౌన్సిలర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరు అనుకుంటున్నట్లు ఇక్కడ మీ ఆటలు కొనసాగవు. ఆర్మూర్‌ను ఓల్డ్‌సిటీ చేస్తావా? అని మండిపడ్డారు. ఓల్డ్ సిటీగా మారుస్తానంటే ఊరుకునేది లేదంటూ చేతిలో ఉన్న మైక్‌ని కింద పడేశారు. అనంతరం వేదిక దిగి బయటికి నడిచారు. అక్కడే ఉన్న విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్యేను సముదాయించడంతో వేదికపైకి తిరిగి వచ్చారు. 'ఏం డ్రామాలు చేస్తున్నారా..? నేను ఇక్కడి ఎమ్మెల్యే. ఐదేండ్లు నేనే ఉంటా. ఇష్టమొచ్చినట్లు చేస్తానంటే చూస్తూ ఊరుకునేది లేదు. ఏ పార్టీ నాయకులైనా తప్పు చేస్తే క్షమించేది లేదని' రాకేశ్‌రెడ్డి తీవ్ర స్థాయిలో వ్యాఖ్యానించారు. మరోవైపు, కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్యను మాట్లాడనివ్వక పోవడంపై కాంగ్రెస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ ఎవరు తప్పుతున్నారో చూసుకోవాలని ఎమ్మెల్యేకు సూచించారు.

పండుగ వేళ.. పడిగాపులు

వేళకు రాని బస్సులు

- గగనంగా మారిన ప్రయాణం
- గ్రామీణ ప్రాంతాల్లో ఆటోలే శరణ్యం
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

బోధన్, అక్టోబర్ 11: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాల్సిన ఆర్టీసీ పండుగ వేళల్లో వారికి చుక్కలు చూపిస్తున్నది. సాధారణంగా పండుగ వేళల్లో బస్సుల్లో రద్దీ సర్వసాధారణం. ఎక్కడెక్కడి నుంచో ఉద్యోగులు, విద్యార్థులు తమ సొంతూళ్లకు వస్తుంటారు. ఇందులో ఎక్కువ మంది ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తుండగా.. వారికి సర్వీసుల రాక కోసం నిరీక్షణ తప్పడంలేదు. దసరా పండుగ కోసం స్వగ్రామాలకు వచ్చేవారు ఆర్టీసీలో ప్రయాణమంటేనే భయపడుతున్నారు. సమయానికి బస్సులు రాకపోవడం.. ఒకవేళ వచ్చినా అందులో సీటు దొరకడం గగనం. ఎంతదూరమైనా నిలబడి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. పండుగలను దృష్టిలో ఉంచుకొని బస్సు సర్వీసులను పెంచి ప్రయాణికుల ఇబ్బందులను తీర్చాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బస్సుల కోసం గంటల తరబడి పడిగాపులు

దసరా పండుగ సందర్భంగా స్వగ్రామాలకు, బంధువుల ఇండ్లకు వెళ్లాలనుకునే ప్రయాణికులు బస్సుల రాకకోసం గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి దాపురించింది. పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంత ప్రజలకు కేవలం పాఠశాలలు, కళాశాలలు కొనసాగే సమయంలో మాత్రమే బస్సు సర్వీసులు ఉండగా, సెలవుల సందర్భంగా సదరు సర్వీసులు రద్దు చేశారు. దీంతో ప్రయాణికులు తమ స్వగ్రామాలకు, ఇతర పనుల కోసం పట్టణాలకు రావాలంటే ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. అధికారులు మాత్రం దసరా సందర్భంగా రెండు రోజుల పాటు అదనంగా సర్వీసులు కొనసాగించామని చెబుతున్నారు. కానీ విద్యాసంస్థలకు సెలవు కావడంతో ఆయా గ్రామాలకు కొనసాగే బస్సులు రద్దు చేసిన మాట వాస్తవమని ఆర్టీసీ అధికారులే వెల్లడించడం గమనార్హం. దసరా సందర్భంగా బస్సుల సంఖ్యను తగ్గించే అవకాశాలు ఉండడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

బస్సు రాదు..వచ్చినా సీటు దొరకదు

ఎల్లారెడ్డి, అక్టోబర్ 11: ఎంత సేపు చూసినా బస్సు రాదు. వచ్చినా సీటు దొరకదు. ఇదీ పరిస్థితి. ఇప్పటి వరకు గంటన్నర నుంచి కామారెడ్డి బస్సు కోసం చూస్తున్నాను. బస్సు వచ్చినా అందులో సీటు దొరకదు.. ఇది పక్కా. కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి చూస్తున్నా.. ఆడవాళ్లు, మగవాళ్లను తోసేసి మరీ వెళ్తున్నారు. టికెట్ కొనుక్కొని నిలబడి ప్రయాణం చేయడం తప్పడం లేదు. ఇంకా ఎన్ని రోజులు ఉంటదో ఈ పరిస్థితి తెలియడం లేదు.

-సాయిరెడ్డి, దేమికలాన్, తాడ్వాయి మండలం

బస్సు ఎప్పుడు వస్తదో తెలియదు..

నేను ఎల్లారెడ్డిలోని మా బంధువుల ఇంటికి వచ్చాను. తిరిగి హైదరాబాద్ వెళ్లడానికి గంటపాటు వేచిచూస్తే ఒకే బస్సు వచ్చింది. అందులో నిలబడే పరిస్థితి లేకపోవడంతో మరో బస్సు కోసం నిరీక్షించా. ఆ బస్సు వచ్చినా అందులో కూడా నిలబడేందుకు చోటులేకపోయినా ఎక్కేశాను. హైదరాబాద్ నుంచి వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు ఇదే పరిస్థితి. బస్సులో ప్రయాణం అంటేనే భయం కలుగుతుంది.

-అనిరుధ్, హైదరాబాద్

వేటు పడింది

- టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ట్రాన్స్‌ఫర్
- 'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్
- తీవ్ర ఆరోపణల నేపథ్యంలో బదిలీ

నిజామాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి):

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడిన పోలీసు అధికారిపై వేటు పడింది. తీవ్ర ఆరోపణలు రావడంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీని ఇక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ చేసింది. సదరు అధికారి వ్యవహార శైలిపై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనానికి ఉన్నతాధికారులు శరవేగంగా స్పందించారు. ఏడాది కాలంగా నిజామాబాద్‌లో పని చేస్తున్న ప్రత్యేక విభాగం ఏసీపీని హైదరాబాద్‌కు బదిలీ చేశారు. జిల్లాలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా ఉంటూ విచ్చలవిడితనంతో పోలీసుశాఖకు చెడ్డపేరు వచ్చే విధంగా వ్యవహరిస్తున్న వైనంపై 'నమస్తే తెలంగాణ' ఈనెల 7వ తేదీన 'ఆయన రూటే సెపరేటు' శీర్షికతో ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. అతని ఆగడాలను బట్టబయలు చేసింది. పోలీస్ కమిషనరేట్ పరిధిలో తప్పుచేసిన కానిస్టేబుళ్లు, ఎస్సైలపై చర్యలు తీసుకుంటున్న ఉన్నతాధికారులు.. విచ్చలవిడిగా ప్రవర్తించిన ఏసీపీపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించడాన్ని 'నమస్తే తెలంగాణ' ఎత్తిచూపింది. ఉమ్మడి జిల్లాలో సంచలనం రేపిన ఈ కథనం రాష్ట్ర స్థాయిలో చర్చనీయాంశమైంది. సదరు ఏసీపీ తీరును సీరియస్‌గా పరిగణించిన సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ విచారణకు ఆదేశించారు. నిఘా వర్గాల సమాచారం, విచారణ అధికారి ఇచ్చిన నివేదికను డీజీపీ కార్యాలయానికి పంపారు. సీపీ సమర్పించిన నివేదిక ఆధారంగా ఏసీపీని బదిలీ చేస్తూ డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఇన్‌చార్జి బాధ్యతలను సీసీఎస్ ఏసీపీకి అప్పగించారు.

అక్రమ సంపాదన కోసం..
లింగనిర్ధారణ పరీక్షలు

- ఇంట్లోనే అల్ట్రా సౌండ్ స్కానర్ ఏర్పాటు
- పోలీసుల సోదాల్లో వెలుగులోకి..
- ప్రధాన నిందితుడితోపాటు 13 మంది అరెస్టు

వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి, అక్టోబర్ 11 : అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధూశర్మ తెలిపారు. ముఠాకు సంబంధించిన వివరాలను జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.రాజంపేట్ మండల కేంద్రానికి బల్ల రవీందర్ తన ఇంట్లో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు ఈ నెల 10న అందిన సమాచారం మేరకు సీసీఎస్ పోలీసులు దాడిచేశారు. సోదాలు నిర్వహిస్తుండగా సిద్దిపేట జిల్లా వర్గల్ మండలానికి చెందిన ఓ మహిళకు లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు గుర్తించి, రవీందర్‌ను అదుపులోకి తీసుకున్నారు. రవీందర్ రాజంపేట్‌లో మల్టీ స్పెషాలిటీ దవాఖాన, కామారెడ్డిలోని కౌసల్య దవాఖానలోని స్కానింగ్ విభాగంలో పనిచేశాడు. 2021లో కౌసల్య దవాఖానను సీజ్ చేయడంతో డబ్బుల కోసం అక్రమ మార్గాలను ఎంచుకున్నాడు. ఆన్‌లైన్‌లో అల్ట్రా సౌండ్ స్కానర్ గురించి తెలుసుకొని వారిని సంప్రదించాడు. అనుమతులు లేకున్నా అమ్మకందారుడు అధిక మొత్తం వసూలు చేసి అల్ట్రా సౌండ్ స్కానర్‌ను రవీందర్‌కు విక్రయించారు. ఎవరికీ అనుమానం రాకుండా తన ఇంట్లో స్కానర్ ఏర్పాటు చేసుకొని లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న క్రమంలో ఈ నెల 10 పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో రవీందర్, అల్ట్రా సౌండ్ మిషన్ విక్రయించిన పి.శాంసన్, చింతల పూడి దుర్గా ప్రసాద్, బోయిని యాదగిరి, బక్కి ప్రవీణ్‌కుమార్‌తోపాటు లింగనిర్ధారణ పరీక్షలు చేయిస్తామని రవీందర్ వద్దకు తీసుకెళ్లిన వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్పీ వివరించారు. ఈ కేసులో మొత్తం 14మందిని నిందితులుగా గుర్తించినట్లు తెలిపారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా పోలీసు కంట్రోల్ రూం 8712686133 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. నిందితులను పట్టుకున్న సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్,భిక్కనూర్ ఇన్‌స్పెక్టర్ సంపత్ కుమార్, రాజంపేట్ ఎస్సై పుష్పరాజ్, సీసీఎస్ ఎస్సై ఉస్మాన్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఉమ్మడి జిల్లా ప్రజలకు ప్రముఖుల దసరా శుభాకాంక్షలు

వినాయక్‌నగర్/కంఠేశ్వర్, అక్టోబర్ 11: ఉమ్మడి జిల్లా ప్రజలకు ప్రముఖులు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. ప్రజలందరూ సుఖ శాంతులు, సిరి సంపదలతో ఆనందంగా ఉండాలని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ తదితరులు ఆకాంక్షించారు. దసరా పండుగ అందరి జీవితాల్లో విజయాలు సమకూర్చాలని, చేపట్టిన ప్రతీకార్యం సఫలీకృతం కావాలని మనసారా కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. దుష్టశక్తులపై విజయానికి సంకేతంగా జరుపుకొనే ఈ పండుగను స్ఫూర్తిగా తీసుకొని, ప్రజలందరూ ఐక్యత కోసం కృషి చేయాలని కోరారు.